ఎస్ఐ కుమారుడు డీఎస్పీ!


తల్లిదండ్రులతో సాయి విశ్వంత్

మణికొండ: అతని తండ్రి పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరి ఎస్ఐ స్థాయికి చేరుకుని నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అతను మాత్రం గ్రూప్–1 పరీక్షల్లో సత్తా చాటి ఏకంగా డీఎస్పీగా ఎన్నికయ్యారు. వివరాలివీ... నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో క్రైం వింగ్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న వీరేశం తన కుటుంబంతో కలిసి మణికొండలో నివసిస్తున్నారు. అతని కుమారుడు సాయి విశ్వంత్ ఇటీవల జరిగిన గ్రూప్స్ పరీక్షలకు పట్టుదలతో సమాయత్తం అయ్యారు. రెండు రోజుల క్రితం ప్రకటించిన ఫలితాలలో అతనికి డీఎస్పీ స్థాయి పదవి దక్కింది. దాంతో తండ్రి సహచరులతో పాటు బంధుమిత్రులు సాయి విశ్వంత్‌ను అభినందించటంతో పాటు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేస్తాం

రాజేంద్రనగర్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గుంతమయంగా మారిన ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల మరమ్మతులకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ వెల్లడించారు. శనివారం బుద్వేల్, రాజేంద్రనగర్, గ్రీన్ సిటీ, గోల్డెన్ హైట్స్, హైదర్‌కాలనీ ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ... రోడ్లకు మరమ్మతులు చేసేందుకు నిధులను మంజూరు చేయించి ఆయా కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



మైలార్‌దేవ్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో సోమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు, వాటర్ వర్క్స్ కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకొని కొత్త దుస్తులను పంపిణీ చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, నేతలు ప్రేమ్‌గౌడ్, జీవన్‌గౌడ్, హనుమంత్, సాగర్, కాశీదాస్, సోమ సందీప్, పల్లపు జగన్, లక్ష్మారెడ్డి, మల్లేష్, పోతరాజ్, సురేష్, సోమ అశోక్, రవిముదిరాజ్, దుర్గప్రసాద్, గుట్టు అంజనేయులు, నవీన్, శ్రీను, సాగర్, రాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బుద్వేల్‌లో రూ. 54 లక్షల వ్యయంతో చేపట్టనున్న హెచ్‌ఎండబ్ల్యూఎస్అండ్ఎస్‌బీ నూతన పైప్‌లైన్ పనులు, బుద్వేల్ రైల్వేస్టేషన్ నుంచి బెంగళూరు హైవే రోడ్ వరకు 450 ఎంఎం డయా ఆర్‌సీసీ ఎన్‌పీ 3 మురుగునీటి లైన్ పనులకు బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. జలమండలి జీఎం ఎస్.సాయిలక్ష్మి, డీజీఎంలు వి.రేణుక, ఖాజా, జోహర్, జియో తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీ అధ్యాపకులకు అంతర్జాతీయ గుర్తింపు

మణికొండ: ప్రపంచంలోని టాప్ 2 శాతం శాస్త్రవేత్తల జాబితాలో గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల అధ్యాపకులు గుర్తింపు పొందారు. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ, ఎల్సెవేర్–2025 సంవత్సరానికి ప్రతిష్టాత్మక వార్షిక డేటాబేస్‌ను శనివారం విడుదల చేశాయి. అందులో భాగంగా సీబీఐటీలో పనిచేస్తున్న అసోసియేట్ డైరెక్టర్ ఆర్డీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.సుధాకర్‌బాబు, గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.కిరణ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ పి. విజయ్‌బాబు ఉన్నారు. పిటేషన్లు, హెచ్–ఇండెక్స్, సహ రచనలు, పరిశోధనా ప్రచురణల ప్రభావం వంటి సమగ్ర ప్రమాణాల ఆధారంగా ఈ గుర్తింపు లభించిందని స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ, ఎల్సెవేర్‌లు పేర్కొన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో తమ అధ్యాపకులకు గుర్తింపు రావటంతో శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు వారిని ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ సుధాకర్‌బాబుకు 2023, 2024, 2025వ సంవత్సరాలలో వరుసగా మూడోసారి గుర్తింపు పొందటం ఎంతో సంతోషకరమన్నారు. అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.కృష్ణవేణి, ఆర్డీ డైరెక్టర్ కె.కృష్ణారెడ్డి, ఈఈఈ హెడ్ బాలసుబ్బారెడ్డి, గణితశాస్త్రం హెడ్ డాక్టర్ స్వాత్మారాం, అధ్యాపకులు పాల్గొన్నారు.


నార్సింగిలో ఔటర్ రింగ్ రోడ్డు కిందుగా ప్రవహిస్తున్న మూసీ నీరు

మూసీ ఉగ్రరూపం!

ఉప్పొంగి ప్రవహిస్తున్న మూసీ నది

- నార్సింగిలో సర్వీసు రోడ్ల మూత
- నిండు కుండల్లా జంట జలాశయాలు
- హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు కొనసాగుతున్న వరద

మణికొండ: హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) పరీవాహక ప్రాంతంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురవటంతో అదే స్థాయి వరద వాటిల్లోకి చేరుతోంది. దాంతో పూర్తి స్థాయి నీటి మట్టాలకు మరో మారు చేరుకోవటంతో శుక్రవారం తెరిచిన గేట్లను శనివారం సైతం కొనసాగించారు. గండిపేటలో శుక్రవారం ఉదయం నాలుగు గేట్లను తెరవటంతో మొదలయి సాయంత్రానికి ఏకంగా 12 గేట్లు 9 అడుగుల మేర ఎత్తి 11650 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలారు. శనివారం ఉదయం ఏకంగా 15 గేట్లను 9 అడుగుల మేర ఎత్తి 12660 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదిలారు. మధ్యాహ్నం తరువాత 4 గేట్లను మూసి 11 గేట్ల ద్వార 984 క్యూసెక్కుల నీటిని వదిలారు. హిమాయత్ సాగర్‌లో శుక్రవారం 8 గేట్లు 6 అడుగుల మేర ఎత్తి 18 వేల క్యూసెక్కుల నీటిని మూసీ నదికి వదిలారు. శనివారం ఉదయం 11 గేట్లను ఆరు అడుగుల మేర ఎత్తి 20,872 క్యూసెక్కుల నీటిని మూసీకి వదిలారు. మధ్యాహ్నానికి ఆరు గేట్లను మూసి ఐదు గేట్ల ద్వారా 9487 క్యూసెక్కుల నీటిని మూసీకి వదిలారు. దాంతో జంట జలాశయాల నుంచి 20,323 క్యూసెక్కుల నీరు మూసీకి వదలటంతో అది ఉప్పొంగి ప్రవహిస్తుంది.


గండిపేట నుంచి పది గేట్ల ద్వారా మూసీలో ప్రవహిస్తున్న నీరు

నిలిచిపోయిన రాకపోకలు...

గండిపేట నుంచి పెద్ద మొత్తంలో వరద నీరు మూసీ నదిలోకి వదలటంతో అది ఉధృతంగా ప్రవహిస్తోంది. దాంతో నార్సింగిలో రెండు వైపులా ఔటర్ సర్వీసు రోడ్లను మూసి వేసి పోలీసుల కాపలాను ఏర్పాటు చేశారు. శంషాబాద్ నుంచి వచ్చి నార్సింగిలో దిగటం, ఎక్కటం చేసే టోల్‌గేట్లను మూసివేశారు. నార్సింగి నుంచి మంచిరేవులకు, గండిపేట నుంచి మొయినాబాద్ వైపు వెళ్లే రోడ్లను మూసి వేశారు. దాంతో నార్సింగి, మంచిరేవుల, మొయినాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.


మంచిరేవులకు నిలిచిపోయిన రాకపోకలు


నార్సింగిలో సర్వీసు రోడ్డు మీదుగా ప్రవహిస్తున్న నీరు

వరదనీటిలో సాయిరాంనగర్ కాలనీ

బండ్లగూడ: ఉస్మాన్‌సాగర్ జలాశయం 13 క్రస్టు గేట్లు 9 ఫీట్‌ల మేర ఎత్తడంతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మూసీ నది ఉధృతంగా ప్రవహించింది. లోతట్టు ప్రాంతమైన హైదర్షాకోట్‌లోని సాయిరాంనగర్ కానీ, సాయిబాబా మందిరంతో పాటు పలు కాలనీలలోకి వరదనీరు చేరింది. పలు నివాసాలలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


నీట మునిగిన సాయిరాంనగర్ కాలనీ

బస్సులన్నీ ఆరాంఘర్ నుంచే..

ఇమ్లిబన్ బస్టాండ్‌కు వెళ్లే బస్సులు ఆరాంఘర్ వరకే

- సీబీఎస్‌లో వరద నీరు చేరడంతో ఇక్కడి నుంచి మళ్లిస్తున్న ఆర్టీసీ
- త్వరలో మరిన్ని అదనపు సర్వీసులు: ఆరాంఘర్ డిపో ఇంచార్జ్ ఉషారాణి

మైలార్‌దేవ్‌పల్లి: ఎడతెరపలి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే గడచిన రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జంట జలాశయాలు నిండటంతో వరద నీటిని మూసీ నదిలోకి వదిలేశారు. దీంతో మూసీ పరీవాహక ప్రాంతాలకు నీరు చేరింది. ఇమ్లిబన్ బస్‌స్టేషన్‌లో వరద నీరు చేరడంతో బస్సులను ఎక్కడికక్కడే నిలిపివేశారు. మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల నుంచి వచ్చే బస్సులను ఆరాంఘర్ చౌరస్తా వరకు మాత్రమే నడుపుతున్నారు. దీంతో నగరవాసులు ఆరాంఘర్‌కి వచ్చి తమ గమ్యాలకు చేరుకోవాల్సి వస్తోంది. ఆరాంఘర్ చౌరస్తాలో దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు అక్కడ నిలిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వందల సంఖ్యలో వస్తున్న బస్సులకు అక్కడి స్థలం సరిపోవడం లేదని డిపో మేనేజర్ ఉషారాణి పేర్కొన్నారు. బస్సుల రద్దీతో పాటు ప్రయాణికుల రద్దీకూడా బాగా పెరిగింది. అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు అక్కడ ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా విధులు నిర్వహిస్తున్నారు. దసరా పండుగను పురస్కరించుకొని డిపో నుంచి 30 బస్సులను అదనంగా నడిపిస్తున్నామని మేనేజర్ వెల్లడించారు. వచ్చే రెండు మూడు రోజులలో మరిన్ని బస్సులు అదనంగా నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం బస్సుల రద్దీ పెరగకుండా వచ్చిన వాటిని ప్రయాణికులతో తొందరగా పంపిస్తున్నామన్నారు.


ఆరాంఘర్ చౌరస్తాలో ప్రయాణికుల రద్దీ

చెరువులను కాపాడుకోవాలి

ఇంగ్లండ్ హై కమిషనర్

మణికొండ: మన పరిసరాల్లో ఉన్న చెరువులను కాపాడుకోవటంతో పాటు వాటిని పరిశుభ్రంగా ఉంచుకుని వాటి వద్ద సేద తీరాలని ఇంగ్లండ్ (యూకే) హై కమిషనర్ గరేత్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట కొత్త చెరువు వద్ద ధృవాన్ష్ ఎన్‌జీఓ వారు నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెరువులను సుందరంగా తయారు చేసుకుని వాటి వద్ద ప్రజలు మంచి వాతావరణాన్ని ఆస్వాదించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చెరువు పరిసరాల్లో పడిన చెత్తను తొలగించారు. ధృవాన్ష్ ఎన్‌జీఓ చేస్తున్న క్లీనింగ్ పనులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ధృవాన్ష్ ఎన్‌జీఓ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


చెరువు క్లీనింగ్‌లో పాల్గొన్న యూకే హై కమిషనర్

నిండుగా వాగులు: నీట మునిగిన పంటలు


కేబీ దొడ్డి వద్ద నీట మునిగిన పంటలు


కేబీ దొడ్డి శివారులో ఈసీ వాగులో వరద

శంషాబాద్ రూరల్: మండలంలో శనివారం వర్షం కాస్త తెరిపి ఇవ్వగా.. వాగుల్లో వరదనీరు నిండుగా ప్రవహించింది. ఈసీ, ఎంటేరు వాగులకు ఎగువ నుంచి వరదనీరు తగ్గుముఖం పట్టింది. సుల్తాన్‌పల్లి–కేబీ దొడ్డి మధ్యలో ఎంటేరువాగుపై ఉన్న కల్వర్టు వద్ద నీటి ప్రవాహంతో రెండు రోజుల నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఈసీ పరీవాహక ప్రాంతాలైన మల్కారం, కేబీ దొడ్డి, సుల్తాన్‌పల్లిలో వరి, పూల పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది.

గ్రామాల్లో 'స్థానిక' సమరానికి సై!

- 21 సర్పంచు, 9 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు..!
- రిజర్వేషన్ల వెల్లడితో నాయకుల ఆశలు ఆవిరి

శంషాబాద్ రూరల్: గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. శనివారం ఎంపీటీసీ, సర్పంచు స్థానాలకు రిజర్వేషన్లను లాటరీ ద్వారా ఖరారు చేయగా.. ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా.. గత వారం రోజులుగా స్థానిక ఎన్నికల కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండడంతో గ్రామాల్లో రాజకీయ హడావుడి నెలకొంది. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉండటంతో నాయకులు పోటీ కోసం సమాయత్తం అవుతున్నారు.

లాటరీతో రిజర్వేషన్లు...

రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం లాటరీ పద్ధతిలో మహిళా రిజర్వేషన్లను ఖరారు చేశారు. అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఎంపీటీసీ, సర్పంచు స్థానాల రిజర్వేషన్ల ఖరారు కూడా చేపట్టారు.

ఆశావాహుల్లో నిరాశ...

ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడం.. వివరాలు అనధికారికంగా వెలువడటంతో ఆశావాహుల్లో నిరాశ నెలకొంది. మండల పరిధిలోని 9 ఎంపీటీసీ స్థానాలు, 21 పంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లను రెండు పర్యాయాలు కొనసాగిస్తామని ప్రకటించడంతో ఆ మేరకు నాయకులు పోటీకి సిద్ధమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం రిజర్వేషన్లను ఎలా చేపడుతుందనే సందేహం ఓ వైపు ఉన్నా.. అవకాశం రాకుండా పోతుందా అనే ఆలోచనతో ఉన్న వారి ఆశలు ఆవిరయ్యాయి. మహిళలకు 50 శాతం స్థానాలు కేటాయించడం.. బీసీ కోటా పెంచడంతో నాయకుల అంచనాలు తారుమారు అయ్యాయి. 21 పంచాయతీల్లో 10 స్థానాలు మహిళలకు కేటాయించారు. తండాలుగా ఉన్న ఐదు పంచాయతీలతో పాటు మరో పంచాయతీని ఎస్టీలకు రిజర్వు చేశారు. నాలుగు పంచాయతీలు ఎస్సీలకు, ఏడు స్థానాలను బీసీలకు కేటాయించారు. ఇక మిగిలిన నాలుగు స్థానాలను జనరల్ కేటగిరిగా మార్చారు. మరో వైపు 9 ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీ–1, ఎస్సీ–2, బీసీ–4, జనరల్–2 స్థానాలను రిజర్వు చేశారు.


ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లకు లాటరీ నిర్వహిస్తున్న ఆర్డీఓ వెంకట్‌రెడ్డి

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళి


ఉద్యాన విశ్వవిద్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు


బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్


మార్కండేయనగర్‌లో...


పద్మశాలీపురం గ్రామంలో...

రాజేంద్రనగర్ జోన్ బృందం: తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలో ఎనలేని సేవలు అందించి.. తన ఆఖరి శ్వాస వరకు పోరాటం చేసిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శనివారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని ఆయన విగ్రహాలకు, చిత్రపటాలను పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను సాధించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని పలువురు వక్తలు పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోరని శ్రీలత మహాత్మా శనివారం తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఉదయం రాజేంద్రనగర్ నుంచి రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మైలార్‌దేవ్‌పల్లి: అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి బాగోగులు చూసుకుంటున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సేవా పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు గోదా పాండు యాదవ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, సన్మానం, ఉపకరణాల పంపిణీ చేశారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్దన్, నేతలు రావుల భాస్కర్, మురళీధర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జగన్, రామారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం


వెంకటమ్మ

మణికొండ: ఇంటి వద్ద ఉండే వృద్ధురాలు అదృశ్యమైంది. నార్సింగి పోలీసుల సమాచారం మేరకు... మహబూబాబాద్ జిల్లా కందికొండ గ్రామానికి చెందిన కొప్పుల వెంకటమ్మ(60) తన కోడలు ఉమతో కలసి నెక్నాంపూర్‌లో 8 నెలలుగా నివసిస్తుంది. ఈ నెల 24వ తేదీన కోడలు కూలీ పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తన అత్త కనిపించలేదు. పలు చోట్ల వెతికినా ప్రయోజనం లేక పోవటంతో శనివారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వృద్ధురాలికి మూర్ఛ వ్యాధి ఉందని, ఆమె పసుపురంగు జాకెట్, గోల్డ్ కలర్ డిజైన్ ఎరుపు రంగు అంచు ఉన్న చీర ధరించిందని పోలీసులు తెలిపారు. ఆమె గురించి ఎవరికైనా తెలిస్తే నార్సింగి పోలీస్‌స్టేషన్ ఫోన్ నెంబర్స్: 94910 39034, 87125 74109లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు



శంషాబాద్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ధర్మగిరి దేవాలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, అభిషేకం, నిత్య హోమం కార్యక్రమాలతో పాటు అన్నదానం చేపట్టారు. పూజా కార్యక్రమాలను ఆలయ ట్రస్టీ బొప్పనాడు స్వాతిదత్తు పర్యవేక్షించారు.

సమతాస్ఫూర్తి కేంద్రంలో ధాన్యలక్ష్మీగా...


శంషాబాద్ రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సమతాస్ఫూర్తి కేంద్రంలో శ్రీ సాకేత అమ్మవారు శనివారం ధాన్య లక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు. అష్టోత్తర నామార్చన, కుంకుమార్చన, అమ్మవారికి అభిషేకం, పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తిని పల్లకిలో ఊరేగించారు.


ధాన్యలక్ష్మి అలంకరణలో అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

ప్రయాణికుడి వద్ద విదేశీ బల్లులు, తాబేళ్ల పట్టివేత



ప్రయాణికుడి వద్ద పట్టుబడిన బల్లులు


శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో భద్రతాధికారుల తనిఖీల్లో ఓ ప్రయాణికుడి వద్ద విదేశీ బల్లులు, తాబేళ్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ... శనివారం సాయంత్రం ఇండిగో విమానం 6ఈ–1068లో విమానంలో బ్యాంకాక్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న లోకేష్ జయచంద్రన్ అనే ప్రయాణికుల లగేజీని అధికారులు తనిఖీ చేశారు. అందులో 8 కీలేడ్ బల్లులు, ఒక గిర్‌డిల్ బల్లి, ఒక రెండు తలలు కలిగిన తాబేలు బయటపడ్డాయి. దీంతో ప్రయానికుడిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. తీసుకొచ్చిన జీవులకు మరో విమానంలో బ్యాంకాక్‌కు తిరిగి పంపారు.


వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న వీసీ జానయ్య దంపతులు, మహిళా ఉద్యోగులు

ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమైన బతుకమ్మ సంబరాలను రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను నేత్రపర్వంగా రూపొందించారు. మహిళాలు పెద్ద ఎత్తున బతుకమ్మ ఆటలు, పాటలలో సందడి చేశారు. – రాజేంద్రనగర్ జోన్ బృందం


పోలీస్ అకాడమీలో డైరెక్టర్ అభిలాష బిస్త్, మహిళా అధికారులు


మణికొండలో కమిషనర్ ప్రదీప్‌కుమార్